క్లుప్తంగా

నేటితరం మహిళలకు రమాబాయి ఆదర్శం



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

కర్నూలు (అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి ని నేటితరం మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక బీక్యాంప్‌లోని మహిళా ఐక్యవేదిక ప్రధాన కార్యాలయంలో రమాబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1898 ఫిబ్రవరి 7వ తేదీ జన్మించిన రమాబాయి 9 ఏళ్లలోనే అంబేడ్కర్‌తో వివాహం జరిగిందన్నారు. అప్పటి నుంచి అంబేడ్కర్‌కు అన్ని విషయాల్లో తోడుగా నిలిచారని తెలిపారు. అంబేడ్కర్ అత్యున్నత స్థాయికి ఎదగడంలో రమాబాయి ది ప్రత్యేక స్థానం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, టౌన్ అధ్యక్షురాలు రాధ,సుబ్బమ్మ పాల్గొన్నారు.

10 నుంచి రాజ శ్యామల నవరాత్రులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మహా గౌరీ అమ్మవారికి శ్రీవిద్య సంప్రదాయానుసారం రాజ శ్యామల నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మిర్చి ఘాటు నుంచి కాపాడండి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి వస్తున్న ఎండుమిర్చి ఘాటుతో స్థానికులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ కార్పొరేటర్ టి.రాముడు అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులతో కలిసి బుధవారం మార్కెట్ కమిటీ సెక్రటరీకి వినతిపత్రం సమర్పించారు.

ఆశావర్కర్ల అరెస్టు దారుణం

కర్నూలు(సెంట్రల్): చలో విజయవాడకు వెళ్తున్న ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఆశావర్కర్ల సంఘం గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని, చలో విజయవాడ కార్యక్రమం సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

నీలి షికారీలకు న్యాయం చేయండి

కర్నూలు (టౌన్): రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బంగారుపేట నీలి షికారీలకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నగరపాలక కార్యాలయం ఎదుట నీలి షికారీలతో కలిసి బీజేపీ నాయకులు ధర్నా చేశారు. చాలా ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నీలిషికారీలు బంగారుపేటలో నివసిస్తున్నారని.. వారికి ఇళ్లు కేటాయించాలన్నారు. అనంతరం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు మురళి నాయుడు, సీఎస్ ఖాన్, శ్రీరాములు యాదవ్, మహేష్ పాల్గొన్నారు.

ఆర్‌యూ హాస్టల్స్‌లో వీసీ తనిఖీ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలోని హాస్టల్స్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ ఆదేశించారు. బుధవారం వర్సిటీలోని హాస్టల్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెస్స్ హాస్టల్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో డిప్యూటీ వార్డెన్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో వసతులు, సౌకర్యాలు మెరుగుపరిచి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీసీ వెంట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్ ఉన్నారు.

పేదలందరికీ ఆరోగ్య సురక్ష



సురక్ష కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్

కర్నూలు(టౌన్): పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష అని 10వ వార్డు కార్పొరేటర్ షేక్ యునూస్ బాషా అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని మాసుంబాషా దర్గా వద్ద ఉన్న తేజ ఫంక్షన్ హాలులో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం ప్రారంభమైంది. పలువురికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశా రు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నజీర్‌ఖాన్, అఖీర్ ఖాన్, షబ్బీర్, సమీర్, సిరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

కష్టపడేవారికి తగిన గుర్తింపు

- కుడా చైర్మన్ కోట్ల, వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ సతీష్
- ఎల్లమ్మ ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



నూతన పాలకవర్గంతో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ పాలకవర్గం కమిటీ చైర్మన్‌గా ఎ.మహేశ్వరరెడ్డి, సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ హాజరై నూతన పాలకవర్గాన్ని అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించేందుకు అందరిని కలుపుకుని సమన్వయంతో పని చేస్తామని, ఇందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేసే విమర్శలను కార్యకర్తలు తిప్పికొట్టాలని, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. కార్యకర్తలందరిని కలుపుకుని పనులు చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పేదవాడికి విద్య, వైద్యం, సంక్షేమం అందాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. తాను స్థానికుడినేనని, కర్నూలులో చదువుకుని ఇక్కడే నివాసం ఉంటున్నానని, పసుపుల పరిధిలో తనకు వ్యవసాయ భూములు ఉన్నాయని, దిన్నెదేవరపాడు గ్రామం సమీపంలో వ్యవసాయ భూములు ఉన్నాయని కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. తాను కర్నూలు నగరంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే పాఠశాల విద్య, కాలేజీ విద్యను పూర్తి చేసి, కర్నూలు మెడికల్ కాలేజీలోనే మెడిసిన్ పూర్తి చేశానని, ఇక్కడే విద్యా సంస్థలు ఏర్పాటు చేసినట్లు ఆయన కార్యకర్తలతో పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కోడుమూరు, గూడురు, సి.బెళగల్ జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, గోశాల చైర్మన్ ఆదిమోహన్ రెడ్డి, కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి, పసుపుల సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, గార్గేయపురం సింగిల్ విండో చైర్మన్ వినయ్‌కుమార్ రెడ్డి, మాజీ చైర్మన్ బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఉల్చాల సొసైటీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, రామోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన జూనియర్ మహిళల జట్టు

కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న అంతర్ జిల్లాల జూనియర్ మహిళల హాకీ పోటీల్లో జిల్లా జట్టు పతకాలతో తిరిగి రావాలని కర్నూలు హాకీ కార్యదర్శి దాసరి సుధీర పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జూనియర్ మహిళల జట్టుకు అక్షయ, రేచల్ రాణి, రేణుకా, నేహారాణి, నేహా తబస్సుం (కర్నూలు), మౌనిక, శ్రీలత, రాధికా, సీమపావని, హిమబిందు, నందిని (నంద్యాల)కు ఎంపికైనట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షుడు ప్రవీణ్, వ్యాయామ ఉపాధ్యాయులు గౌడ్, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: నియోజకవర్గ సమస్యలపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. సీమకే జీవనాడి అయిన గోరుకల్లు జలాశయాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలగనూరు రిజర్వాయర్ కట్ట కుంగిపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదని, ప్రాజెక్టుపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వెలగమాన్ డ్యామ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ డ్యామ్‌కు సంబంధించి జిందాల్ సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు అలైన్‌మెంట్ మార్చారని, ఇందుకు ఆ కంపెనీ రూ. 5కోట్లు ఇస్తామన్నారన్నారు. ఈ పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు చేపట్టాలని కోరారు. అలాగే కల్లూరు మండలం ఉలిందకొండలో ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఉన్నత విద్య కోసం విద్యార్థులు 25 కి.మీ వెళ్లాల్సి వస్తోందన్నారు. కర్నూలులో ఉన్న పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి 16 వార్డుల్లో రోజు నీరు అందించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే గడివేముల మండలం బుజునూరు గ్రామం వద్ద ఉన్న గాలేరు-నగరి సుజల స్రవంతి కాల్వపై బ్రిడ్జి నిర్మించేందుకు చొరవ తీసుకోవాలన్నారు.

జగనన్న చొరవతోనే కర్నూలు అభివృద్ధి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే హాఫీజ్



కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతోనే కర్నూలు అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే పలు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. కర్నూలు ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంతంలో సుమారు 4,700 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడం, తయారీ రంగం, ఫార్మా ఇండస్ట్రీల ఏర్పాటుకు సంబంధించి నీటి అవసరాలు తీర్చడం ద్వారా యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కర్నూలును ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఐటీ మంత్రికి విన్నవించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరైన జోహరాపురం ఇందిరమ్మ కాలనీ ఇళ్ల కేసు న్యాయ స్థానంలో పెండింగ్‌లో ఉందని, లబ్ధిదారులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని గృహ నిర్మాణశాఖ మంత్రిని కోరారు

16న రవాణా సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ విధానాలతో రవాణా రంగాన్ని కుదేలు చేయడానికి పూనుకున్న నేపథ్యంలో ఫిబ్రవరి 16వ తేదీ దేశవ్యాప్తంగా రవాణా సమ్మెకు పిలుపునిచ్చినట్లు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ తెలిపారు. బుధవారం కార్బైడ్ ఫ్యాక్టరీ ఆవరణలో లాంగ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ చట్టంతో డ్రైవర్లను జైళ్లకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించాల్సి ఉందన్నారు. లేదంటే భవిష్యత్‌లో రవాణా రంగం మూతపడే ప్రమాదం ఉందన్నారు. 16వ తేదీ జరిగే సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రతి కార్మికుడు కృషి చేయాలని కోరారు.

ఆల్బెండజోల్ మాత్రల అందజేత



మాత్రలను అందజేస్తున్న ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్

కర్నూలు(హాస్పిటల్): నులిపురుగుల నివారణలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని మండల అభివృద్ధి అధికారికి, ఉప విద్యాశాఖాధికారికి రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. అనంతరం గార్గేయపురం, బి.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో మాత్రలు పంపిణీ చేసిన తర్వాత పిల్లలు, మాత్రల సంఖ్యను ఎంపీడీఓ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీ డీవార్మింగ్ డేను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వెంకటరమణ, పీహెచ్‌ఎన్ నిర్మలాదేవి, హెచ్‌ఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత





సరస్వతికి స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు, త్యాగరాజస్వామి వేషధారణలో విద్యార్థి

కర్నూలు కల్చరల్: సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శారదా సంగీత నృత్య ప్రభుత్వ కళాశాల విశ్రాంత అధ్యాపకులు సి.సరస్వతి అన్నారు. కళాశాలలో బుధవారం సద్గురు శ్రీత్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె త్యాగరాజస్వామి కీర్తనలు ఆలపించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాకారులు త్యాగరాజస్వామి కీర్తనలతో సంగీత కచేరి చేశారు.

ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించాల్సిందే



ఎండీయూ వాహనాన్ని పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డిమౌర్య

కర్నూలు(సెంట్రల్): నగరంలోని అన్ని క్లస్టర్లలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు అందజేయాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం గణేష్‌నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండీయూ వాహనాల ద్వారా అందజేస్తున్న సరుకులను కచ్చితంగా ఇళ్లు లేదా ఇళ్ల సమీపంలోకి వెళ్లి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆపరేటర్లు, వలంటీర్లను ఆదేశించారు. సరుకులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఎస్‌ఓ కేవీఎస్‌ఎం ప్రసాదు, అర్బన్ ఏఎస్‌ఓ ఉన్నారు.

పావనీలతకు కన్నీటి వీడ్కోలు





పావనీలత అంతిమయాత్రలో పాల్గొన్న పురప్రముఖులు, కలెక్టరేట్ వద్ద పావనీలత చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులు

కర్నూలు(హాస్పిటల్): అవయవదానం చేసి నలుగురికి ప్రాణదానం చేసిన పావనీలతను ఆదర్శంగా తీసుకోవాలని నగరంలోని ప్రముఖులు వ్యాఖ్యానించారు. అవయవదానం చేసిన పావనీలత అంతిమ యాత్ర బుధవారం ఉదయం స్థానిక బాలాజీనగర్ నుంచి జొహరాపురం వరకు సాగింది. నగరంలోని స్వచ్ఛంద సంస్థలు, పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. యాత్రలో జనవిజ్ఞాన వేదిక, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా సంఘం నాయకులు, కళాకారులు పాటలు పాడుతూ వీడ్కోలు పలికారు. కేశవ రెడ్డి, శ్రీలక్ష్మి, కేఎస్‌ఆర్ పాఠశాలల విద్యార్థులు రోడ్డుకు ఇరువైపులా నిలుచుని పుష్పాలు చల్లుతూ జోహార్లు చెప్పారు. కేవీఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పుష్పగుచ్ఛాలతో నివాళులు అర్పించారు. సాయంత్రం కలెక్టరేట్ వద్ద పావనీలత చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ కేజీ. గోవిందరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి. సురేష్‌కుమార్, మానవత కన్వీనర్ మనోహర్‌రెడ్డి, మహిళా కమిటీ కన్వీనర్ యాని ప్రతాప్, అపర్ణ, దీప, లక్ష్మి, రాజు, రేణుక, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, ఆవోపా నాయకులు యుగంధర్ ప్రసాద్‌గౌడ్, హరికిషన్, బజరంగదల్ నాయకులు ప్రతాపరెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్



సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసిన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 16న గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు తెలిపారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు ఉద్యమం సందర్భంగా మద్దతు ధర చట్టాన్ని తెస్తామని చెప్పిన కేంద్రం ఆ తర్వాత పట్టించుకోలేదన్నారు. అలాగే విద్యుత్ సవరణ బిల్లు అమలు, కార్మికులకు కనీస వేతనం తదితర హామీలను నెరవేర్చలేదని తెలిపారు. గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన శ్రీబుగ్గరామేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ. డీఆర్‌కేవీ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8 నెలలకు సంబంధించి స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయ శాఖ సమక్షంలో ఉదయం 10.30 గంటలకు లెక్కిస్తామన్నారు.

కల్వర్టు పనులు పూర్తి చేయండి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 29వ వార్డు పరిధిలో ఉన్న బాలాజీనగర్‌లో కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం నాయకులు జి.ఏసు, ఎస్.హుస్సేన్‌బాషా కోరారు. బుధవారం కల్వర్టు కోసం తీసిన గుంతను పరిశీలించారు. పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు

కోడుమూరు రూరల్: ప్రతిఒక్కరూ ప్రశాంతంగా జీవనం సాగించాలని సీఐ మన్సురుద్దీన్ సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏ మాత్రం అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం ఉదయం కోడుమూరులో సీఐ ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్‌ఐలు బాలనరసింహులు, పీరయ్య, తిమ్మారెడ్డి సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. ఎన్నికలను సమయంలో అనవసరమైన గొడవలకు వెళితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

ఆర్‌యూ రెక్టార్‌గా ఎన్‌టీకే నాయక్



కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం నూతన రెక్టార్‌గా ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్ నియమితులయ్యారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటసుందరానంద నియామక పత్రాన్ని జారీ చేశారు. ఇప్పటి వరకు వర్సిటీ రెక్టార్‌గా ఉన్న ప్రొఫెసర్ కృష్ణారెడ్డి స్థానంలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, సీడీసీ డీన్, అకడమిక్ అఫైర్స్ డీన్, ఆర్‌యూ పాలక మండలి సభ్యుడిగా ఉన్న ఎన్.టి.కె.నాయక్ రెక్టార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన అప్పటి ఎస్వీయూ కర్నూలు పీజీ సెంటర్‌లో 1989లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. 1998 అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2006లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 35 ఏళ్ల బోధనానుభవం ఉన్న ఈయన వర్సిటీలో పలు విభాగాలకు హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. పీజీ సెంటర్ యూనివర్సిటీగా మారాక వర్సిటీ మొదటి రిజిస్ట్రార్‌గా 2008-2012 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రిన్సిపల్‌గా 2013 నుంచి 2015 వరకు ఉన్నారు. ఎగ్జామినేషన్స్, రీసెర్చ్, సీడీసీ డీన్‌గా బీఓఎస్ చైర్మన్ పదవులను విజయవంతంగా నిర్వర్తించారు.

వర్సిటీలోని పలువిభాగాల డీన్‌లు మార్పు

వర్సిటీ రెక్టార్‌గా ఉన్న సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి సీడీసీ డీన్‌గా నియమితులయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొఫెసర్ సుందరానందకు ఎగ్జామినేషన్స్ డీన్, ఇండస్ట్రీస్ ఇంటరాక్టివ్ సెల్ డీన్‌గా బాధ్యతలు అప్పగించారు. రీసెర్చ్ స్టడీస్ డైరెక్టర్, హాస్టల్స్ చీఫ్ వార్డెన్‌గా ఎంబీఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ విశ్వనాథరెడ్డికి, లీగల్ సెల్ ఓఎస్‌డీగా భరత్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆర్‌యూ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌ప్రేమ్‌కుమార్ వర్సిటీని గాడిలో పెట్టేందుకు పలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే వర్సిటీ నూతన రెక్టార్, నూతన రిజిస్ట్రార్‌ల నియామకంతో పాటు వర్సిటీలోని అన్ని విభాగాల డీన్‌లను మార్పు చేశారు. వర్సిటీ పనివేళల మార్పు, ఉద్యోగుల హాజరుకు బయోమెట్రిక్ విధానం అమలు తదితర అంశాలపై సీనియర్ ప్రొఫెసర్లతో వీసీ చర్చించినట్లు తెలిసింది.

ఉద్యాన పంటలను ప్రోత్సహించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలని ప్రాజెక్టు ఆఫీసర్(ఎంపీడీఓ) మల్లీశ్వరి అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కేవలం కూలీలకు పనులు కల్పించడమే కాకుండా ఉద్యాన పంటలైన పండ్లు, పూలు సాగు చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలానికి 500 ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయిలో తిరిగి రైతుల అభిప్రాయాలు సేకరించాలని పేర్కొన్నారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పర్కులేషన్ ట్యాంకులు, నీటి కుంటల వద్ద వర్క్‌సైట్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కూలీలకు గరిష్ట వేతనం అందేలా పనులను గుర్తించాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, సీఏల్‌ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.358 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీఎన్‌జీఓ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ కర్నూలు నగరశాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న కోరారు. బుధవారం నగరంలోని వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలు చెల్లించడంతో పాటు డీఏ బకాయిలు, 11వ పీఆర్‌సీ అరియర్స్ చెల్లించాలని కోరారు. 12వ పీఆర్‌సీ ఆలస్యమవుతున్నందున 30 శాతానికి తగ్గకుండా ఐఆర్ ఇవ్వాలని కోరారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 13 నుంచి ఐక్య ఉద్యమంలో భాగంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు శ్రీనివాసులు, సాయిరామ్, హేమలత, స్వరూప్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.